# నీటి సరఫరాలో ఇబ్బందులు రానీయొద్దు

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- ఇబ్రహీంపట్నం మండలం డబ్బా వాటర్ గ్రిడ్ పరిశీలన



ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

ఇబ్రహీంపట్నం, మే 5: తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఆదేశించారు. మండలంలోని డబ్బా వాటర్ గ్రిడ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ అధికారులతో మిషన్ భగీరథ పైపులైన్ పనులు, శుద్ధ జల నిర్వహణ, నీటి సరఫరా, తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. నియోజకవర్గంలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మిషన్ భగీరథలో పని చేస్తున్న పంప్ ఆపరేటర్లకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఏజీఎం సందీప్‌తో మాట్లాడి వెంటనే జీతాలు ఇచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు.

*తులం బంగారం ఎక్కడ?*

కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఇస్తామని ప్రకటించిన తులం బంగారం ఏదని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలోని రైతు వేదికలో ఆయన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు కల్యాణలక్ష్మి సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటించి ఇప్పటి వరకు ఇవ్వక పోవడం విడ్డూరమన్నారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గోపీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దశరథ్‌రెడ్డి, నాయకులు నేమూరి సత్యనారాయణ, కంఠం రమేశ్, చిన్నారెడ్డి, పుప్పాల చిన్ననర్సయ్య, రెబ్బటి రాజేందర్, జిల్లాల పవన్, బీఆర్ఎస్ నాయకులు, మిషన్ భగీరథ డీఈ జలేందర్, ఏఈలు మల్లేశ్, వింధ్య, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

**పథకాల అమలులో సర్కార్ విఫలం**

మల్లాపూర్, మే 5: సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల్లో ప్రజలకు మోసపూరితమైన హామీలను ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీర్‌సింగ్, మాజీ జడ్పీటీసీ సంది రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సయ్య, సింగిల్‌విండో మాజీ చైర్మన్ కాటిపల్లి ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క
- పెగడపల్లి మండలం కీచులాటపల్లిలో అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క, విప్ లక్ష్మణ్‌కుమార్, ఎంపీ వంశీకృష్ణ, తదితరులు

పెగడపల్లి, మే 5: రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క పేర్కొన్నారు. పెగడపల్లి మండలం కీచులాటపల్లిలో ధర్మపురి నియోజకవర్గంలో చేపట్టే రూ.20 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను సోమవారం ఆమె విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి ఆవిష్కరించారు. అలాగే, ఎల్లాపూర్‌లో గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఎల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటికే రూ.20 కోట్లు మంజూరు చేయగా, విప్ లక్ష్మణ్‌కుమార్ విజ్ఞప్తి మేరకు మరో రూ.30 కోట్లు మంజూరు చేస్తానని పేర్కొన్నారు. జగిత్యాలలో జిల్లా పరిషత్ భవనానికి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. అనంతరం నర్సింహునిపేటలో సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో మంత్రి సీతక్క, విప్ లక్ష్మణ్‌కుమార్, ఎంపీ వంశీకృష్ణ, అధికారులు, నాయకులు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, కలెక్టర్ సత్యప్రసాద్, డీఆర్డీవో రఘువరన్, జడ్పీ సీఈవో గౌతం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములుగౌడ్, పీఆర్ సీఈ సమత, ప్రత్యేకాధికారి వేణుగోపాల్, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, ఏపీఎం సమత, నాయకులు పాల్గొన్నారు.

## హరీశ్‌రావును కలిసిన మాజీ మంత్రి



హరీశ్ రావుతో మాజీ మంత్రి రాజేశం గౌడ్

జగిత్యాల, మే 5: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును హైదరాబాద్‌లో మాజీ మంత్రి రాజేశం గౌడ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

జగిత్యాల టౌన్, మే 5: జగిత్యాలలోని ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2025–26 విద్యా సంవత్సరంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ప్రభుత్వం దోస్త్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. కళాశాలలో డిస్ట్రిక్ట్ హెల్ప్‌లైన్ సెంటర్ అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ, ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్స్ కోర్సుల్లో సీట్లు ఉన్నట్లు తెలిపారు. వివరాలకు కళాశాలలోని డిస్ట్రిక్ట్ హెల్ప్ లైన్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

## దరఖాస్తుల ఆహ్వానం

వెల్గటూర్, మే 5: వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్థుల మెరిట్ ప్రకారం ఈనెల 26న ఎంపికైన వారి జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. జాబితాలో ఎంపికైన విద్యార్థులు 27 నుంచి 31 వరకు కాలేజీలో అడ్మిషన్ పొందాలని తెలిపారు. బాలికలకు హాస్టల్ వసతి ఉన్నట్లు వెల్లడించారు.

ఇబ్రహీంపట్నం, మే 5: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఇల్లెందుల ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

## పంటల సాగుపై అవగాహన

రాయికల్, మే 5: రాయికల్ మండలం అల్లీపూర్‌లోని రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పొలాస శాస్త్రవేత్తలు సోమవారం రైతులకు పంటల సాగు విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ రవి, శ్రీనివాస్ మాట్లాడుతూ, అవసరం లేకుండా పురుగు మందులను వాడొద్దని పేర్కొన్నారు. పంట మార్పిడి చేస్తే భూసారం పెరిగి అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్, ప్యాక్స్ చైర్మన్ రాజలింగం పాల్గొన్నారు.

## రేచపల్లిలో అధ్యాపకుల ప్రచారం

సారంగాపూర్, మే 5: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సోమవారం రేచపల్లి గ్రామంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇండ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. కళాశాలలో కోర్సులు, ప్రత్యేకతలు వివరించారు. పిల్లలను కళాశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, అధ్యాపకులు శ్రీధర్, రాజు, సౌజన్య, సుజాత, వెంకటేశ్వర్లు, సంపత్ రావు, శ్రావణ్ ఆర్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, మే 5: మండలంలోని లంబాడిపల్లి, దోమలకుంట గ్రామాలకు మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మల్యాల, మే 5: గుర్తు తెలియని వ్యక్తుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నరేశ్ సూచించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మహిళలు ఆభరణాలు ధరించి, ఒంటరిగా ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## హైకోర్టు జడ్జి మృతికి సంతాపం

మెట్‌పల్లి, మే 5: హైకోర్టు న్యాయమూర్తి గిరిజా ప్రియదర్శిని మృతికి సోమవారం మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. గిరిజా ప్రియదర్శిని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి అరుణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి రాందాస్, కోశాధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల, మే 5: పట్టణంలో హైకోర్టు జడ్జి గిరిజా ప్రియదర్శిని చిత్రపటానికి బార్ అసోసియేషన్ సభ్యులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు బైరి విజయ్ కుమార్, నరేందర్, శ్రీనివాస్, రోజా, రాము, రాములు, వివేక్ పాల్గొన్నారు.

## రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

మల్లాపూర్, మే 5: రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలని ఏవో లావణ్య సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం ఆమె రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సహకారంతో రైతులకు సంబంధించిన భూములు, పంటల వివరాలను ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి కార్డులను మంజూరు చేస్తామని తెలిపారు. ఇక్కడ ఏఈవో గజానంద్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కథలాపూర్, మే 5: కథలాపూర్ మండలం పోసానిపేట గ్రామానికి చెందిన గుంట హన్మంతు సౌదీ అరేబియాలో మృతిచెందాడు. గల్ఫ్‌లో ఉంటున్న ఈ ప్రాంత వాసులు రూ. 76,500 సేకరించి, పంపించగా, సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మామిడిపెల్లి గంగాధర్, చింతకుంట రాజేశ్, సందనగిరి గణేశ్, పెంటాల శేఖర్ తదితరులున్నారు.

## పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల నిరసన

జగిత్యాల, మే 5: రంగారెడ్డి జిల్లాలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ కృష్ణమాచారిపై వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ వెంకట్ యాదవ్ అసభ్యకరంగా మాట్లాడడాన్ని ఖండిస్తూ జిల్లాలోని వెటర్నరీ అసిస్టెంట్లు, లైవ్ స్టాక్ అసిస్టెంట్లు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లుల, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నరియన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి పూర్ణచందర్, కార్యదర్శి నాగేందర్ రెడ్డి, కోశాధికారి గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలి

జగిత్యాల, మే 5: వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ముస్లింలు జామా మసీదు, టవర్‌సర్కిల్, న్యూ బస్టాండ్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

## సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ డే

జగిత్యాల కలెక్టరేట్, మే 5: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రతి సోమవారం గ్రీవెన్స్ డేను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారితో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

# పోలీసుల అదుపులో నకిలీ ఫోన్ పే ముఠా ..?

పెగడపల్లి, మే 5: పెగడపల్లి పోలీసులు నకిలీ ఫోన్ పే ముఠాను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఎల్లాపూర్ సమీపంలోని నక్కపల్లిలో శ్రీనివాస్‌కు చెందిన కిరాణా దుకాణానికి సోమవారం ఇద్దరు వ్యక్తులు కారులో వచ్చి ఆయిల్, సిగరేట్ ప్యాకెట్లు, ఇతర రూ.6500 విలువైన సామగ్రి కొనుగోలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. వారు ఫోన్ పే నుంచి డబ్బులు చెల్లిస్తామని చెప్పి, షాపులోని ఫోన్ పే స్కానర్‌కు తమ ఫోన్ నుంచి స్కాన్ చేసి డబ్బులు వచ్చినట్లు తమ ఫోన్‌లోని మెసేజ్‌ను కిరాణా వ్యాపారికి చూపెట్టి, అక్కడి నుంచి వెళ్లి పోయారు. కిరాణా వ్యాపారి తన మొబైల్ చెక్ చేసుకోగా, డబ్బులు రాక పోవడంతో వెంటనే బైక్‌పై కారును వెంబడించి, గ్రామస్తుల సహకారంతో ఎల్లాపూర్‌లో ఆపి వారిని నిలదీశారు. ఫోన్ పే పని చేయలేదని, పొంతన లేని సమాధానాలు చెప్పడంతో గ్రామస్తులు వారిని నిలదీసి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారి కారును తనిఖీ చేయగా, అందులో ఇతర షాపుల్లో కొన్న సామగ్రి ఉండడంతో పాటు కారు నంబర్ ప్లేట్‌పై వైట్ పేపర్ అతికించినట్లు తేలడంతో వారిని స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ ముఠా సభ్యులు వారం క్రితం పెగడపల్లిలో, రెండు రోజుల క్రితం రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో ఇలాగే నకిలీ ఫోన్ పేతో మోసం చేసి కిరాణా సామగ్రి తీసుకెళ్లినట్లు తెలిసింది. పలువురు బాధితులు పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ట్రైనీ ఎస్ఐ రవీందర్‌కుమార్‌ను వివరణ కోరగా గ్రామస్తుల ఫిర్యాదుతో ఎల్లాపూర్‌కు కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులను స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

## పంట మార్పిడి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

సారంగాపూర్, మే 5: రైతులు పంట మార్పిడి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పోతారం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం పొలాస వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో సోమవారం రైతులకు పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, రైతులు పంట వేసే ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు నిర్వహించి, దానికి అనుగుణంగా వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల ప్రకారం సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, సమతుల్య ఎరువుల వినియోగం, తక్కువ యూరియా వాడి సాగు ఖర్చులు తగ్గించుకోవాలని, అవసరం మేరకు రసాయనాల వినియోగం, సాగు నీరు ఆదా, పంట మార్పిడి, చెట్లను పెంచడం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ శ్రీలత, ఏడీ సాయిదా నాయక్, డీఏవో భాస్కర్, తిరుపతి నాయక్, వ్యవసాయాధికారి ప్రదీప్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సురేందర్ పాల్గొన్నారు.

## సీనియర్ సిటీజన్లకు అండగా ఉంటా

జగిత్యాల మే 5: సీనియర్ సిటీజన్లకు అండగా ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో వయోవృద్ధుల సంరక్షణ చట్టం గురించి వివరిస్తూ ముద్రించిన పోస్టర్లు, కరపత్రాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. జిల్లాలో కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో సీనియర్ సిటీజన్ల కేసులను పరిష్కరిస్తున్న ఆర్డీవో మధుసూదన్, సీనియర్ సిటీజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, సంఘ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ సభ్యులు గౌరిశెట్టి విశ్వనాథం, హన్మంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించాలి

మెట్‌పల్లి రూరల్, మే 5: గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అధికారులకు సూచించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పలు అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అధికారులు సమన్వయంతో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ నీళ్లు సరిగ్గా రావడం లేదని పలువురు తన దృష్టికి తీసుకొచ్చారని, అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో నీళ్లు వచ్చేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక జాబితాలను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలని సూచించారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత పట్ల అలసత్వం వహిస్తున్నారని, పారిశుధ్య పనులు సరిగ్గా చేపట్టడం లేదని, గ్రామాల్లో నిర్వహించే శుభ్రత కార్యక్రమాల్లో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పల్లె ప్రకృతి వనాల సంరక్షణపై దృష్టిసారించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆనంద్, పంచాయతీ రాజ్ డీఈ రమణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★Kolipaka Pavani, W/o Kolipaka Krishna (Old Name), H.No. 4-17/4, Chandrampet Sircilla Mandal, Rajanna Sircilla Dist., my Name is changing to Sandupatla Navya, W/o. Kolipaka Krishna (New Name) NTK-000

★Lokam Varsha, W/o Lokam Venkatesham (Old Name), H.No. 11-3-108/1, B.Y. Nagar, Sircilla Town and Mandal, Rajanna Sircilla Dist., my Name is changing to Sabbani Thirumala, W/o. Lokam Venkatesham (New Name) NTK-000

CHANGE OF NAME

★Koduri Vajravva alias Laxmi, W/o Koduri Laxmipathi, H.No. 9-2-9 Nehrunagar, Sircilla town and mandal, Rajanna Sircilla Dist., My name is changing to Koduri Vajravva W/o. Koduri Laxmipathi (New Name) NTK-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## భూ సమస్యల పరిష్కారానికే 'భూ భారతి చట్టం'

ధర్మపురి, మే 5: భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలు చేసిందని విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. భూ భారతి పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా సోమవారం బుగ్గారం మండలం యశ్వంతరావుపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ సత్వర పరిష్కారానికి అనువుగా ఉన్న వాటిని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ మాజిద్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెగడపల్లి, మే 5: పెగడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 2009–10 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒక చోట కలిసి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి, శాలువాలతో సన్మానించారు. పాఠశాలకు పూర్వ విద్యార్థులు రాజశేఖర్, రాధ, కృష్ణవేణి, స్రవంతి ప్రింటర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పరశురాం, రమణాచారి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్, మే 5: పైడిమడుగు జడ్పీ ఉన్నత పాఠశాల 1998–99 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్థానిక మదురమ్మ ఆలయ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

కోరుట్ల రూరల్/కథలాపూర్, మే 5: కోరుట్ల మండలం జోగన్‌పల్లి, కథలాపూర్ మండల కేంద్రంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కొత్త అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు జీవన్ రెడ్డి, మారంపెల్లి అర్జున్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## వైజ్ఞానిక రంగంలో భారత్‌దే అగ్రస్థానం

జగిత్యాల, మే 5: వైజ్ఞానిక రంగంలో భారత్ అగ్రస్థానంలో నిలుస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ సంఘచాలక్ డాక్టర్ భీమనాతిని శంకర్ పేర్కొన్నారు. జగిత్యాలలో వాల్మీకి ఆవాసం సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ శంకర్ మాట్లాడుతూ, ఉచిత కంప్యూటర్ శిక్షణను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త కోటగిరి అరవింద్, వాల్మీకి ఆవాసం అధ్యక్షుడు జడిగే పురుషోత్తం, కార్యదర్శి నందెల్లి మదన్‌మోహన్ రావు, కమిటీ సభ్యులు సంపూర్ణ చారి, కంప్యూటర్ శిక్షణ ఇన్‌చార్జి బెక్కం మల్లేశం, బొమ్మెర సత్యనారాయణ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రెండు రోజుల జైలు

జగిత్యాల కలెక్టరేట్, మే 5: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి జగిత్యాల స్పెషల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు జగిత్యాల సీఐ వేణుగోపాల్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇటీవల వాహనాల తనిఖీ చేస్తుండగా, రాయికల్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన పరశురాం వచ్చారని, బ్రీత్ అనలైజర్ పరీక్ష చేయగా, మోతాదుకు మించి మద్యం సేవించినట్లు తేలిందని చెప్పారు. సదరు వ్యక్తిని కోర్టులో హాజరుపర్చగా, మేజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

## దమ్మన్నపేటలో సాధనశూరుల ప్రదర్శన

మేడిపల్లి, మే 5: మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో సోమవారం సాధనశూరులు ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంజి సుభాష్, చింతకింది రాజు, గంజి జగన్, గంజి రాజు, దొంతుల రమేశ్, గంజి చంద్రమౌళి, గంజి తేజ, తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలకు అధిక ప్రాధాన్యమివ్వాలి

జగిత్యాల రూరల్, మే 5: ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రజలు వస్తారని, అర్జీలను పెండింగ్‌లో పెట్టవద్దన్నారు. కాగా, కార్యక్రమానికి 60 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవోలు జివాకర్ రెడ్డి, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ వివిధ జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ లెక్చరర్ల పాలిట దేవుడు కేసీఆర్

కోరుట్ల, మే 5: కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మా కుటుంబాల పాలిట దేవుడని కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు డింగరి ప్రశాంత్ పేర్కొన్నారు. రెండేళ్ల ప్రొబేషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం కళాశాలలో ప్రిన్సిపాళ్లుగా పని చేసిన గౌసూర్ రహ్మాన్, ఎంఏ వాజిద్, మునీరొద్దీన్‌కు సోమవారం ఆయన ఆత్మీయ సత్కారం చేశారు. మా కుటుంబాల్లో వెలుగులు నింపిన కేసీఆర్‌కు ఎళ్లవేళాల రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

## మాజీ మావోయిస్టుకు పరామర్శ

కోరుట్ల, మే 5: కోరుట్లలోని అంబేద్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్న మాజీ మావోయిస్టు పసుల వసంతను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వసంతపై ప్రకటించిన రూ. 8 లక్షల రివార్డు, ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ నాయకులు గంగాధర్, అంజిరెడ్డి, సత్యనారాయణ, అనిల్, లక్ష్మీనారాయణ, నాగభూషణం, తదితరులున్నారు.

## అంజన్న హుండీల లెక్కింపు

మల్యాల, మే 5: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలోని ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో 12 హుండీలను సోమవారం విప్పి లెక్కించగా 39 రోజులకు గానూ నగదు రూపేణ రూ. 1,07,67,134 వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీకాంతరావు తెలిపారు. 134 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుండీ లెక్కింపు పరిశీలకుడు రాజమౌళి, ఆలయ ప్రధాన అర్చకుడు రామకృష్ణ, ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్, సునీల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు అశోక్, రవి, రాములు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను ఆపాలి

జగిత్యాల, మే 5: ఛత్తీస్‌ఘఢ్‌లో కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఆపాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిలిపివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు బండ శంకర్, గాజంగి నందయ్య, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంలో తనిఖీ

జగిత్యాల, మే 5: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌ను ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు కలెక్టర్ బీ సత్యప్రసాద్ సోమవారం తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రతకు సంబంధించి నెలవారీ తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి సందర్శించారు. కలెక్టర్ వెంట కోరుట్ల ఆర్డీవో జివాకర్, అర్బన్ తహసీల్దార్ రాంమోహన్, ఎలక్షన్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మేడిపల్లి, మే 5: మేడిపల్లికి చెందిన ఐలేని రాజశేఖర్‌కు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. కాగా, సోమవారం నాయకుడు చేపూరి నాగరాజు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేదరి లాజర్, ఉరుమడ్ల నర్సయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులకు అభినందన

ధర్మపురి, మే 5: బుగ్గారం మండలం వెల్గొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో 50 శాతం విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం అభినందనీయమని మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు కొనియాడారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం వెల్గొండలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ట్రైనీ ఎస్ఐగా రవీందర్‌కుమార్

పెగడపల్లి, మే 5: పెగడపల్లి మండలానికి ట్రైనీ ఎస్ఐగా మిర్యాల రవీందర్‌కుమార్ నియమితులయ్యారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ రవికిరణ్ ఓ కేసు విషయంలో సస్పెన్షన్ అయ్యారు. ఆయన స్థానంలో రవీందర్‌కుమార్‌ను నియామకం చేయగా, సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

## ఘన సత్కారం

కోరుట్ల, మే 5: పట్టణంలో కుమ్మరి శాలివాహన యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ చిలువేరి రాజశేఖర్‌ను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఇక్కడ సంఘం అధ్యక్షుడు మారుపాక రాజభూమయ్య, ఉపాధ్యక్షుడు దుంపేట రవి, ప్రధాన కార్యదర్శి రాజారాం, కోశాధికారి గంగారాం, సభ్యులు రాములు, సుధాకర్, మహేశ్, తదితరులున్నారు.

## కోరుట్ల వాసికి డాక్టరేట్

కోరుట్ల, మే 5: పట్టణానికి చెందిన కోల రమేశ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఓయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ పారుపల్లి పర్యవేక్షణలో 'సెల్ఫ్ ఎస్టీం, కోపింగ్ స్ట్రాటజీస్ ఆఫ్ స్టూడెంట్స్ ప్రిపేరింగ్ ఫర్ కాంపిటేటివ్ ఎగ్జామ్ ఇన్ తెలంగాణ స్టేట్ స్టడీ' అంశంపై పరిశోధన గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించారు. పరిశీలించిన పరీక్షల విభాగం అధికారులు రమేశ్‌కు డాక్టరేట్ అందజేశారు. కాగా, రమేశ్ ప్రతిష్టాత్మకమైన యూజీసీ నెట్ జేఆర్ఎఫ్ సాధించారు. రమేశ్‌ను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

## ప్రతిభావంతులకు సత్కారం

మేడిపల్లి, మే 5: భీమారం మండలం గోవిందారం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సోమవారం జీర్డ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంగడి ఆనంద్‌కుమార్ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో యాళ్ల మధుసూదన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు హస్పక్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ పుల్లూరి ఉమాదేవి, నాయకులు నీరటి మల్లేశం, పేట నారాయణ, పుల్లూరి దేవయ్య, చెక్కపెల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్, గంగారాజు పాల్గొన్నారు.

## వృద్ధులను వేధిస్తే చర్యలు

జగిత్యాల, మే 5: వయోవృద్ధులను వేధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన వృద్ధుల సంరక్షణ చట్టాన్ని వివరిస్తూ ముద్రించిన పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, సభ్యులు విశ్వనాథం, పీసీ హన్మంత రెడ్డి, ఎండీ యాకూబ్, ప్రకాశ్ రావు, విఠల్, ప్రభాకర్ రావు, జలజ పాల్గొన్నారు.